క్లుప్తంగా

భవిష్యత్తు అంతా బీజేపీదే

ఎంపీ రఘునందన్ రావు



ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న రఘునందన్‌రావు

సిద్దిపేటజోన్: ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, భవిష్యత్తు అంతా బీజేపీదేనని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానికంగా బీజేపీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డికి పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేందుకు పనిచేయాలని సూచించారు. బీజేపీపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కావాలనే బురద చల్లుతున్నాయని ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల అంశంలో బీఆర్‌ఎస్ సన్నాయి నొక్కులు నొక్కుతోందని విమర్శించారు. తప్పు చేసిన బీజేపీ ఎంపీలు ఎవరో కేటీఆర్ తేల్చాలని సవాల్ విసిరారు. అంతకుముందు ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కోమరయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రానుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె చెరువు సందర్శన



చెరువును పరిశీలిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణంలోని ఆరపల్లె చెరువును మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేసింది. దీంతో అక్కడ చేపట్టాల్సిన పనుల గురించి ఆరా తీశారు. అందులో భాగంగా డీఈ మహేశ్, ఏఈ మహేశ్, గ్రామస్తులతో కలిసి పల్లె చెరువును ఆయన సందర్శించారు.

పదోన్నతులతో మరింత బాధ్యత: సీపీ



పదోన్నతి పొందిన వారితో సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన దూద్యా నాయక్, వెంకటరెడ్డిని శుక్రవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో సేవలందించాలన్నారు.

27న రజతోత్సవ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్: నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు భవిష్యత్ గుర్తించి దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

ఎండలతో అప్రమత్తం

తొగుట(దుబ్బాక): ఎండల తీవ్రత పెరగడంతోఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని గుడికందులలో శుక్రవారం ఆయన ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉంచకపోవడం సరికాదన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ భైరవరెడ్డి ఉన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎనిమిది మంది విద్యార్థినులు అసోసియేట్ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్యూచరిస్టిక్ టెక్ సంస్థ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు 96 మంది పాల్గొన్నారు. ఎంపికైన వారికి రూ.3.5లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ రాకేశ్, ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ పాల్గొన్నారు.

రైతుకు దూరంగా ‘వేదిక’లు

- 3 నుంచి 6 కి.మీ దూరంలో నిర్మాణాలు
- అవగాహన సదస్సులకు వెళ్లలేని పరిస్థితి
- అలంకారప్రాయంగా మారిన భవనాలు



ముస్త్యాల రైతు వేదిక



నాగపురి రైతు వేదిక

చేర్యాల(సిద్దిపేట): పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు రైతులందరు సమావేశమై వ్యవసాయంపై చర్చించుకోవడం కోసం ప్రభుత్వం గ్రామాలను క్లస్లర్లుగా ఏర్పాటుచేసి రైతు వేదికలు నిర్మించింది. కానీ ఇవి క్లస్టరు పరిధిలోని గ్రామాలకు దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. చేర్యాల పట్టణంతో పాటు మండల పరిధిలో 18 పంచాయతీలున్నాయి. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఏడు క్లస్టర్లుగా విభజించారు. అందులో చేర్యాల, ఆకునూరు, ముస్త్యాల, గుర్జకుంట, చిట్యాల, కడవేర్గు, నాగపురి గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు.

దూరంగా.. భారంగా

నాగపురి క్లస్టర్‌లోని పెద్దరాజుపేట, ముస్త్యాల క్లస్టర్‌లోని చుంచనకోట గ్రామాలు రైతు వేదికలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. మిగతా గ్రామాలు ఆయా క్లస్టర్లకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల రైతులు రైతు వేదికలకు వద్దకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వ్యవసాయం గురించి విలువైన సమాచారం, సూచలనలను తెలుసుకోలేక నష్ట పోతున్నారు.

అధికారులూ అంతే..

ఊళ్లకు దూరంగా ఉండడంతో కొంత మంది అధికారులు కూడా రైతు వేదికలకు వెళ్లడంలేదు. గ్రామాల్లోనే ఫీల్డ్ విజిట్‌చేసి వెనుదిరుగుతున్న పరిస్థితి. దీంతో ఆ రైతు వేదిక భవనాలు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా తయారయ్యాయి. అయినా సంబంధిత అధికారులు దృష్టిసారించక పోవడంతో లక్షలు ఖర్చుచేసి నిర్మించిన రైతువేదికలు అలంకారప్రాయంగా మారుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



వేదికల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కానీ క్లస్టర్ పరిధిలోని కొన్ని రైతు వేదిక భవనాలు గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆయా గ్రామాల రైతులు అక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్ని సందర్భాల్లో రైతులకు వాహనాలు సమకూర్చి శిక్షణకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. దీంతో గ్రామాల్లోనే అవగాహన కల్పిస్తున్నాం.

– బోగేశ్వర్, ఏఓ చేర్యాల

ఆరు కిలోమీటర్ల దూరంలో..



మా గ్రామాన్ని ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ముస్త్యాల క్లస్టర్‌లో కలిపారు. గ్రామం నుంచి అక్కడకు వెళ్లాలంటే వాహన సౌకర్యం ఉండాలి. కిరాయి వాహనంలో వెళ్లాలంటే రానుపోను రూ.వెయ్యి ఖర్చవుతుంది. రైతులు అంత కేటాయించలేని పరిస్థితి.

– నర్సింహులు, రైతు, చుంచనకోట

రవాణా సౌకర్యం లేక..



మా గ్రామం పెద్దరాజుపేట నుంచి నాగపురికి సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రైతు వేదిక దూరంగా ఉండటంతో రవాణా సౌకర్యం లేక అవగాహన సదస్సులకు వెళ్లలేకపోతున్నాం. అనుకూలమైన చోట భవనాలు నిర్మిస్తే బాగుంటుంది.

– చెప్యాల వెంకటేశం, రైతు పెద్దరాజుపేట

దరఖాస్తు చేసుకొనేదెలా?

- గంటల తరబడి నిరీక్షణ
- ‘రాజీవ్ యువ వికాస’ అభ్యర్థుల ఆవేదన



దుబ్బాక మీసేవలో దరఖాస్తుదారుల నిరీక్షణ

దుబ్బాకటౌన్: దేవుడు కరుణించినా.. పూజారి వరమివ్వలేన్నట్లుంది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం పరిస్థితి. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా మార్గదర్శకాలను సిద్ధం చేసింది. అయితే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవ, ఆన్‌లైన్ సెంటర్లకు వెళితే నిరాశే ఎదురవుతోంది. శుక్రవారం దుబ్బాక మీసేవ కేంద్రంలో పలువురు అభ్యర్థులు అవస్థలు పడ్డారు. ఒక్కో దరఖాస్తుకు గంటల సమయం లైన్లో వేచి ఉన్నారు. అయినా సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో వారంతా అసహనానికి గురయ్యారు. మూడు రోజులే గడువు ఉందని వాపోయారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

50 శాతం రిజర్వేషన్లు కల్పించండి

బీసీ సంఘాల నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

హుస్నాబాద్: చట్టసభలు, విద్య, ఉద్యోగరంగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీసీ చైతన్య సదస్సు నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఫంక్షన్ హాల్ వరకు పార్టీలకు అతీతంగా ర్యాలీ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. హుస్నాబాద్‌లో బీసీ భవన్, స్టడీ సర్కిల్, ఫంక్షన్ హాల్‌కు స్థలం కేటాయించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, దళిత, బీసీ సంఘాల నాయకులు సాయన్న, రవీందర్, చంద్రమౌళి, రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని బయ్యారంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్లాపూర్‌లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో అల్లీపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సొసైటీ చైర్మన్ సదానందం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ సర్పంచ్ చంద్రకళ, మాజీ ఎంపీటీసీ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలో శనివారం పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. వరదరాజుపల్లి, గోవర్ధనగిరి, కాన్గల్, లింగంపేట, రాంపూర్, చందాపూర్, వెంకట్రావుపేట, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): బడుగు బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బీజేపీ రిజర్వేషన్లు ఎత్తివేయాలని చూస్తోందని, రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజుగామ, అహ్మదీపూర్‌లో

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బెజుగామ, అహ్మదీపూర్ గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బెజుగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాములు, శ్రీనివాస్, శివారెడ్డి, సంతోష్ కుమార్, గంగాధర్, పోశయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మెట్‌పల్లి, మాచాపూర్ గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కొనసాగింది. డీసీసీ కార్యదర్శి సాకి ఆనంద్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలే మన దేశానికి పునాదులన్నారు. కార్యక్రమంలో మహేందర్, పరశురాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదించిన వరం తల్లిపాలు

సీడీపీఓ శారద



గజ్వేల్‌రూరల్: గర్భిణులు, బాలింతలకు ఆహార పదార్థాలను అందజేస్తున్న సీడీపీఓ సరిత తదితరులు

సిద్దిపేటఅర్బన్: తల్లిపాలతోనే పిల్లలకు మంచి పోషకాలు లభిస్తాయని, తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన వరమని సీడీపీఓ శారద అన్నారు. మండల పరిధిలోని పొన్నాలలో శుక్రవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల పోషకాలు లభిస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు వైద్యుల సూచన మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీం, సూపర్‌వైజర్ సునీత, ఏపీఎం సాగర్, పోషణ్ అభియాన్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గీత, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: పోషక విలువలున్న ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండగలమని సీడీపీఓ సరిత చెప్పారు. మండల పరిధిలోని గిరిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా అవగాహన కల్పించారు. అలాగే సంగుపల్లిలో చిరుధాన్యాలతో తయారుచేసే ఆహార పదార్థాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి వివరించారు. సూపర్‌వైజర్ భవాని, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి మండలంలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాలల్లో అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, రేణుక, బుజ్జమ్మ, పున్నమ్మ, రేణమ్మ, రమ, జమున, తార, స్వప్న, మమత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత్‌నగర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో భారత్‌నగర్, హనుమాన్‌నగర్, ఇస్లాంపుర, ఎన్సాన్‌పల్లి, నల్ల పోచమ్మ ఆలయ ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పోటీ పరీక్షలపై అవగాహన

సిద్దిపేటఎడ్యుకేషన్: తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సునీత, కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి

బెజ్జంకి(సిద్దిపేట): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ సమగ్ర పాలసీ కోసం ప్రత్యేకంగా సలహా కమిటీ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం నాయకులు భైరవరెడ్డి, రంగారెడ్డి, మహేందర్, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే

మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వివిధ పార్టీలు, సంఘాల నేతలు పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు వక్తలు కొనియాడారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ జాతీయ నేత చాడవెంకట్‌రెడ్డి



గజ్వేల్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ..

సామాజిక తత్వవేత్త పూలే

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: వివక్షలేని సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు.



దుబ్బాకలో నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా నేత భాస్కర్ తదితరులు



సిద్దిపేటజోన్: మున్సిపల్ కార్యాలయంలో ఆశ్రిత్‌కుమార్ తదితరులు



నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



హుస్నాబాద్: నివాళులు అర్పిస్తున్న నాయకులు

‘భగీరథ’ నీరు వృథా

- అధికారుల పర్యవేక్షణ లోపం
- రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



బోడిగెపల్లి ప్రధాన రహదారిలో వృథాగా పోతున్న తాగునీరు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలం బోడిగెపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. రెండు రోజులుగా ప్రధాన పైపులైన్ గేట్‌వాల్ పగలిపోవడంతో నీరులీకై రోడ్డుపైనే ప్రవహిస్తోంది. బీటీ రోడ్డు పనుల్లో భాగంగా ఆ పైపులైన్ పగిలిందని, అధికారుల పర్యవేక్షణ కరువవ్వడం వల్లే రోడ్డు పొడవునా నీరు నిలిచిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దృష్టి సారించండి..

జిల్లా ఉన్నతాధికారులు మాత్రం చుక్క భగీరథ నీరు వృథా కానీయకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా పైపులైన్లు పగిలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని చెబుతున్నారు. కానీ భగీరథ పైపు గేట్‌వాల్ పగిలిపోయి నీరు వృథాగా పోతున్నా అటువైపు ఎవరూ కన్నెత్తి చూడకపోవడం శోచనీయమం. ఇకనైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి ప్రజల గొంతు ఎండక ముందే నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పొన్నంకు వినతి పత్రం

నంగునూరు(సిద్దిపేట): దివ్యాంగులకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణ వసతి కల్పించాలని కోరుతూ శుక్రవారం నంగునూరు పర్యటనకు వచ్చిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దివ్యాంగుల ప్రతినిధులు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, యాకూబ్, కనకయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

గజ్వేల్‌రూరల్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. యూత్‌కాంగ్రెస్ నాయకులు గురువారం మోదీ చిత్రపటాన్ని దహనం చేయడాన్ని ఖండించారు. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. మహేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ పోరాటం తప్పనిసరి

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై తప్పనిసరిగా పోరాటం చేయాలని, అప్పుడే రుణాల నుంచి పొందగలమని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ శోభన్ అన్నారు. అఖిల భారత కిసాన్ సభ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మర్రిముచ్చాలలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు భరోసాను పూర్తిస్థాయిలో జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నక్క యాదవ్, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ వేలం పాటలు వాయిదా

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించ తలపెట్టిన వేలం పాటలను శనివారం ఆలయ అధికారులు వాయిదా వేశారు. ఆలయంలో సెల్‌ఫోన్ భద్రపరుచుకునే లైసెన్సు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బందిని అందించే ఏజెన్సీ కోసం, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు వేలం పాటలు వేయాలని నిర్ణయించారు. నిబంధనల ప్రకారం షెడ్యూల్స్ రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

◆ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ములుగు(గజ్వేల్): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మండల ఇన్‌చార్జి వెంకటరమణ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్, నర్సింహులు, మహేశ్‌గౌడ్, బాబు, హరికృష్ణ, భాగ్యలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌సింగ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.